క్లుప్తంగా

లిబరేషన్ అభ్యర్థుల ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మూర్తి

ఏలేశ్వరం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థులను పట్టణంలో బుధవారం ప్రకటించారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. కాకినాడ పార్లమెంట్‌కు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రావు, ప్రత్తిపాడు అసెంబ్లీకి జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, తుని అసెంబ్లీకి వాడిపోయిన శివ పోటీ చేస్తారని ప్రకటించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ కాకినాడ పార్లమెంట్, పలాస, చోడవరం, ప్రత్తిపాడు, తుని, తెనాలి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేచుకట్ల సింహాచలం, కె.జనార్ధన్, మానుకొండ లచ్చబాబు, గొడుగు సత్యనారాయణ, చిన్నిబిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య కర సేవకులకు సన్మానం



యర్రవరంలో కర సేవకులను సన్మానిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: అయోధ్య కరసేవకు వెళ్లిన వారిని మండలంలోని యర్రవరంలో బుధవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, కురాకుల రాజా ఆధ్వర్యంలో కర సేవకులు తోట సూర్యాకాంతం, తోట రాఘవరావు, తోట శ్రీనివాసరావు, తోట వెంకటరత్నం, గొల్లవిల్లి బాలులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 1992లో అయోధ్యకు యర్రవరం గ్రామానికి చెందిన కరసేవకులు వెళ్లారని తెలిపారు. శ్రీరామనవమి పురస్కరించుకుని వారిని సన్మానించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, మైరాల కనకరావు, పోతాబత్తుల పెదబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



కుమ్మరిపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, తదితరులు

గోకవరం: స్థానిక కుమ్మరిపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.7 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు బుధవారం పరిశీలించారు. కుమ్మరిపేట ఏర్పడిన నాటి నుంచి వీధి రోడ్లు సక్రమంగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాలనీవాసుల ఇటీవల ఎంపీపీ సుంకర శ్రీవల్లిని కలిసి రోడ్లు నిర్మించాలని మొర పెట్టుకున్నారు. దీనిపై జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం ఆదేశాల మేరకు రెండు నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేయగా బుధవారం పనులు చేపట్టారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: తంటికొండ సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం తెలిపారు. గోకవరం, తంటికొండ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు జగ్గంపేట మండలంలో...

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, రాజపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట డీఈ రత్నాలరావు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీసీవై పార్టీ ఎంపీ అభ్యర్థిగా దేవర అనూష



ప్రత్తిపాడు రూరల్: భారత యువజన చైతన్య (బీసీవై) పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవర అనూష యాదవ్ పోటీ చేస్తున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తొలి జాబితాలో ఆమె పేరును ప్రకటించారు. అనూష ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



రత్నగిరిపై సీతారాములకు అరుంధతీ నక్షత్రం చూపిస్తున్న పండితులు



ఎస్.జగ్గంపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు



పాతకొట్టాంలో సీతారాముల కల్యాణం



ఎ.మల్లవరంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం

- వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శ్రీరామస్మరణతో మార్మోగిన పల్లెలు

శ్రీరామ నవమి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామాలు, పట్టణాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాలను మామిడి తోరణాలు, పువ్వులతో సుందరంగా అలంకరించారు. పండితులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.



ఎన్టీ రాజాపురంలో సీతారాములను దర్శించుకుంటున్న తోట రాంజీ



ఏలేశ్వరం సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వరుపుల సుబ్బారావు



విశేష అలంకరణలో దర్శనమిచ్చిన సీతారాములు

తుని/తుని రూరల్/ఏలేశ్వరం/కిర్లంపూడి/గోకవరం/గండేపల్లి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/రౌతులపూడి/తొండంగి/శంఖవరం/కోటనందూరు/జగ్గంపేట/అన్నవరం: రామ నవమిని పురస్కరించుకుని తుని మార్కండ్రాజుపేట, కొత్తపేట, గవరపేట, మార్కెట్ యార్డు, పాతబజారు వీధి, బెల్లపు వీధి, బాలకోన్నత పాఠశాల, వీరవరపుపేట తదితర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామివారి కల్యాణంలో పాల్గొన్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం సత్యనారాయణస్వామి ఆలయంలోని సీతారాముల ఉపాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. తొలుత పురోహితుడు గాథావఝుల సూర్యనారాయణ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, దళే కిషోర్, తొండారపు రాంబాబు, పైల విజయ్‌కుమార్, సుంకర రాంబాబు, మలకల వేణు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక దిబ్బపాలెం, పల్లపువీధి, పైడిమల్లమ్మ వీధిలోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు.

ఆలయాలను దర్శించిన తోట రాంజీ

వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ కిర్లంపూడి మండలంలోని పలు రామాలయాలను సందర్శించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కొండయ్యపేటలోని రామాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, దాడి చినబుజ్జి, దోమాల గంగాధర్, వేగి రామకృష్ణ, అడారి మహేష్, చదలవాడ వేణు పాల్గొన్నారు.

గోకవరం మండలంలో...

గోకవరం రామసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా ఇనకోటి బాపన్నదొర దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం జరిపారు. మురళీనగర్‌లోని ఆంజనేయస్వామి, అచ్చియ్యపేటలో రామాలయం, బత్తులవారి వీధిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

గండేపల్లి మండలంలో..

గండేపల్లి మండలంలోని ఎన్టీ రాజాపురం, సూరంపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ నేతలు పరిమి వెంకటేశ్వరరావు, దోమాల గంగాధర్, కుంచె చినబాబు, కొట్టు శివరామకృష్ణ, గుత్తుల గంగాధర్, తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, ఏలూరు, చినశంకర్లపూడి, పెద శంకర్లపూడి, లంపకలోవ, ధర్మవరం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాడు తోటవీధి, మునసబుగారి రామాలయం, పర్వత గుర్రాజు రామాలయం, జక్కావారి వీధి తదితర ప్రాంతాల్లో జరిగిన కల్యాణ వేడుకల్లో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి గుడాల వెంకటరత్నం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

ఏకశిలపై వెలసిన పురాతన ఆలయంలో...

రౌతులపూడి మండలంలోని రామగిరికొండపై ఏకశిలపై వెలసిన పురాతన కోదండరాముని కల్యాణం కన్నులపండువగా జరిగింది. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపారు. మండలంలోని ఎ.మల్లవరం, రౌతులపూడి, శృంగవరం, ఎస్.అగ్రహారం, పారుపాక, గిడజాం, బీబీపట్నం గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొండంగి మండలంలోని ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, శృంగవృక్షం, వేమవరం, పెరుమాళ్లపురం, దానవాయిపేట, పైడికొండ, తొండంగి, బెండపూడి, పి.అగ్రహారం, సీతారాంపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామాల్లని పలు ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులకు పానకాలు పంపిణీ చేశారు.

పాతకొట్టాంలో..

కోటనందూరు మండలం పాతకొట్టాంలో ఆలయ ధర్మకర్త యడ్ల చెల్లరావు పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం జరిపించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పానకం, ప్రసాదాలు వితరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. శంఖవరం మండలంలోని ఎస్.జగ్గంపేటలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

సీతారాములకు అరుంధతీ నక్షత్ర దర్శనం

రత్నగిరిపై శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా నవదంపతులు సీతారాములకు పండితులు బుధవారం రాత్రి అరుంధతీ నక్షత్ర దర్శనం చేయించారు. రాత్రి ఏడు గంటలకు వేద మంత్రాల నడుమ సీతారాములను ఊరేగింపుగా రామాలయం వెలుపలకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు చేసి ఆకాశంలో అరుంధతి నక్షత్రం వైపు చూపించారు. అనంతరం రామాలయానికి తీసుకువెళ్లారు.

తుని మండలంలో..

తుని మండలంలో ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, ఎన్.చామవరం, వల్లూరు, హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, తేటగుంట, వి.కొత్తూరు, లోవకొత్తూరు, తాళ్లూరు, కుమ్మరిలోవ, కొలిమేరు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాలు కన్నుల పండువగా జరిగాయి. కల్యాణం అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. జగ్గంపేట మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణాలు వైభవంగా జరిగాయి. రామవరంలో సీతారాముల పల్లకీ సేవ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత రావుల గణేష్ రాజా స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో భక్తులకు పానకాలు పంపిణీ చేశారు.



గోకవరంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఎస్.అన్నవరంలో సీతారాములు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సంక్షేమ సారథికి అండగా నిలవండి

కోటనందూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ కోరారు. కోటనందూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప సర్పంచ్ దార్ల సూర్యచంద్ర, ఎంపీటీసీ మల్లంపల్లి ప్రకాష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి దాడిశెట్టి రాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ నారాయణమూర్తి రాజు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కోన అప్పారావు, ఉల్లూరి శ్రీను, చింతల దొరబాబు, తోలెం విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో..

అన్నవరం: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. అన్నవరంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, కొల్లు బాబూరావు, పలివెల కొండలరావు, కొండి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిప్పుల కొలిమి

- భగ్గుమంటున్న భానుడు
- అల్లాడుతున్న ప్రజలు

ప్రత్తిపాడు/తొండంగి: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ఉగ్రరూపం చూపుతున్నాయి. మరోపక్క ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. గత రెండు రోజులుగా ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. బుధవారం ప్రత్తిపాడులో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలల్లో కూడా ఇదే పరిస్థితి. ఏప్రిల్ నెలలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే ఇక మే నెలలో పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండ దెబ్బకు ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేకపోతున్నారు. ఉదయం 10 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ప్రజలు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, పండ్ల రసాలు తీసుకుంటూ ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.



ఎండదెబ్బకు నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డు

హార్టికల్చర్ బోర్డు మాజీ డైరెక్టర్ సత్యకృష్ణంరాజు మృతి



తుని రూరల్: నేషనల్ హార్టికల్చర్ బోర్డు మాజీ డైరెక్టర్, జాతీయ కిసాన్ మోర్చా మాజీ కార్యదర్శి చోడ్రాజు సత్య కృష్ణంరాజు (47) అనారోగ్యంతో మృతి చెందారు. తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన సత్య కృష్ణంరాజు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కొద్దిరోజులుగా ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విమానంలో ముంబై నుంచి రాజమహేంద్రవరానికి అక్కడ నుంచి అంబులెన్సులో స్వగ్రామం తేటగుంటకు సత్య కృష్ణంరాజు మృతదేహాన్ని తీసుకువచ్చే ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సత్య కృష్ణంరాజుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచి బీజేపీలో చురుగ్గా పని చేశారు. ఆ పార్టీలో వివిధ పదవులు చేపట్టిన ఆయన జాతీయ కిసాన్ మోర్చా కార్యదర్శి, జాతీయ ఉద్యాన బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు. సత్యకృష్ణంరాజు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



రామవరం పెట్రోల్ బంక్‌లో సిలిండర్లతో మంటలు ఆర్పే విధానం వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

తుని: ప్రస్తుత వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుని అగ్నిమాపక అధికారి కె.రాముడు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జీఎస్టీ రోడ్డులోని పెట్రోల్ బంకులో సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. పెట్రోల్ కొట్టే సమయంలో మంటలు వ్యాపిస్తే ఏలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

జగ్గంపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని రామవరం పెట్రోల్ బంక్ సిబ్బంది, వినియోగాదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ !

- కాలేజీ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు
- రూ.4.50 కోట్లతో భవనాల నిర్మాణం
- రూ.50 లక్షలతో మౌలిక వసతుల కల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం



కళాశాల ఆవరణలో పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టనుంది. కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఉచ్చాతర్ శిక్షా అభియాన్‌లో భాగంగా రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిలో రూ.4.50 కోట్లు భవనాల నిర్మాణానికి మిగిలిన రూ.50 లక్షలు మౌలిక వసతులకు కేటాయించారు. కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వరుపుల సుబ్బారావు చొరవతో...

ఏలేశ్వరం పట్టణం ఏజెన్సీ ముఖ ద్వారంగా ఉంది. పరిసర గ్రామాలతో పాటు ఏజెన్సీ విద్యార్థులు ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసిస్తారు. గతంలో ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2009లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు విజ్ఞప్తి మేరకు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. తదనంతరం ఉన్నత విద్యాశాఖ భవనాల నిర్మాణాలకు రూ.కోటి మంజూరు చేసింది. ఆ నిధులతో 2018 ఏప్రిల్ 15న భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 2020 జనవరి 8న నూతన డిగ్రీ కళాశాల భవనాలను ప్రారంభించారు.

నిధులతో ప్రగతి సాధించనున్న కళాశాల

ప్రస్తుతంలో కళాశాలలో బీఏ 40, బీకాం 60, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ మాథ్స్ 40 చొప్పున సీట్లు కేటాయించారు. ప్రస్తుతం కళాశాల భవనంలో ఆఫీసు రూమ్‌తో కలిపి నాలుగు తరగతి గదులు ఉండగా మూడు గదులను ల్యాబ్‌లుగా వాడుతున్నారు. కళాశాలలో తరగతుల నిర్వహణకు గదులు లేని పరిస్థితి నెలకొంది. సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షిఫ్టుల పద్ధతిలో మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం 5:30 వరకు కళాశాల నడుపుతున్నారు. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో తుప్పలు పెరిగిపోయి విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయించడంతో కళాశాలలో సమస్యలు తీరనున్నాయి.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటు



కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభపరిణామం. నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతాం. భవనాల నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు పూర్తిస్థాయితో కళాశాల అందుబాటులో ఉంటుంది.

– డాక్టర్ డి.సునీత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల